వార్డుల అభివృద్ధికి కృషి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మంగళవారం 2వ వార్డు పరిధి పసుమాములలోని శ్రీరాంనగర్ కాలనీ, మంజీరా కాలనీల్లో రూ.25 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ పనులకు కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరి సహకారంతో వార్డుల్లో దశల వారీగా ప్రగతి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఈ అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు శంకరయ్యగౌడ్, నాయకులు గూడెపు శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ఉపాధ్యాయులైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కొత్తూరు, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను తోటి విద్యార్థులు శ్రద్ధతో విన్నారు. ఉపాధ్యాయులతో పాటు, కలెక్టర్, డీఈవో ఎంఈవో తదితర పాత్రలో విద్యార్థులు చక్కగా ఒదిగిపోయి తమ విధులను నిర్వర్తించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలీశ్వర్, ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, కమలేశ్, ఉమాదేవి, మంజుల, చంద్రకళ, ఘాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ ఏఎన్ఎం మల్లమ్మ సస్పెన్షన్

మృతిచెందిన బాలుడి తల్లిదండ్రులకు ఏఎన్ఎం మల్లమ్మ సస్పెన్షన్ లెటర్ అందజేస్తున్న వైద్యాధికారి హరికిషన్

కొత్తూరు, ఫిబ్రవరి 13: ఏడాది క్రితం టీకా వికటించి ఓ పసికందు మృతిచెందిన కేసులో కొత్తూరు మున్సిపాలిటీ తిమ్మాపూర్ సబ్‌సెంటర్ ఏఎన్ఎం మల్లమ్మను వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఏడాది క్రితం రొటీన్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా సరైన జాగ్రత్తలు తీసుకోకుండా టీకా వేసినందువల్లే తమ కుమారుడు చనిపోయాడని బాలుడి తల్లిదండ్రులు చిటికెల సునీత, సరేశ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు కూడా నమోదు చేశారు. ఈ నెల 10న హైకోర్టు ఆదేశాల మేరకు వైద్యా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఏఎన్ఎం మల్లమ్మను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు కొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్ బాలుడి తలిదండ్రులకు మల్లమ్మను విధుల నుంచి తొలగించిన లెటర్‌ను మంగళవారం కొత్తూరులో అందజేశారు.

షాబాద్ : జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం : రమణారెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

తరలిన గులాబీ శ్రేణులు

- చలో నల్లగొండ సభకు పెద్ద ఎత్తున హాజరు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

యాచారం : మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సభకు వెళ్తున్న గులాబీ శ్రేణులు

షాబాద్, ఫిబ్రవరి 13: కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన నల్గొండ బహిరంగ సభకు చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మంగళవారం నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాల నుంచి పార్టీ శ్రేణులు బస్సుల్లో కేసీఆర్ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ కావలి మల్లేశ్, సీనియర్ నాయకులు శేరిగూడెం వెంకటయ్య, గంగిడి భూపాల్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, కృష్ణగౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం బృందం : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు సక్రమంగా సాగునీరు అందించకుండా ప్రాజెక్టుల నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించటాన్ని నిరసిస్తూ నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వెళ్లారు.

ఆమనగల్లు : బహిరంగ సభకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని 13 గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కోట్లాడింది నీళ్లు,నిధులు, నియామకాల కోసమనేనని, కృష్ణా నీటిలో మన వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం తెలంగాణ హక్కులను కోల్పోవడమేనని ఆయన అన్నారు. కృష్ణానీటిపై కేంద్రానికి అన్ని హక్కులు పోతే ఆఖరికి మంచినీటికి కూడా సొంతంగా వాడుకునే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరమేశ్, వెంకటయ్య, కుమార్, కృష్ణ, జంగయ్య, కేశయ్య, లక్ష్మణ్, సురేశ్, బాలరాజు, మల్లేశ్, నర్సింహ్మ, రామకృష్ణ, రమేశ్, విజేందర్ పాల్గొన్నారు.



నందిగామ : చలో నల్లగొండ సభకు వెళ్తున్న జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

షాద్‌నగర్ : నియోజకవర్గం నుంచి వందలాది మంది కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ మున్సిపాలిటీతో పాటు ఫరూఖ్‌నగర్, కొందుర్గు, కేశంపేట, చౌదరిగూడ, కొత్తూరు, నందిగామ మండలాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, కేశంపేట ఎంపీపీ వై. రవీందర్ యాదవ్, షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజేశ్ పటేల్, బాబురావు, దేవేందర్‌యాదవ్, జూపల్లి శంకర్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీ నర్సింహారెడ్డి, అశోక్, చీపిరి రవియాదవ్, మాల మహేశ్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కొత్తూరు : చలో నల్లగొండ సభకు తరలివెళ్తున్న కొత్తూరు బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్ పట్టణం నుంచి సభకు తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు

మున్సిపాలిటీ కమిషనర్‌గా శ్రీనివాస్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13 : శంకర్‌పల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. గతంలో వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై శంకర్‌పల్లి మున్సిపాలిటీకి వచ్చారు. మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన జ్ఞానేశ్వర్‌ను రంగారెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేషన్ పీడీ మెప్మా అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చర్యలు తీసుకోవాలని వినతి

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 13: పార్కులోని మొక్కలను ధ్వంసం చేసి కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట లక్ష్మారెడ్డి పాలెం లుంబినీహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని మున్సిపల్ పార్కులో గత హరితహారం కార్యక్రమాల్లో భాగంగా నాటిన మొక్కలను పలువురు తొలగించారని, వాటికి రక్షణగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను ధ్వంసం చేశారని వివరించారు. కాలనీ కమిటీ పార్కును పరిశీలించింది. కార్యక్రమంలో సురకంటి కృష్ణారెడ్డి, వడ్డే కృష్ణారెడ్డి, చిలుకూరు వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

కడ్తాల్, ఫిబ్రవరి 13 : మక్తమాదారం గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయ ప్రధాన అర్చకుడు తిరుమల వింజామూరు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి కోవిల్ ఆళ్వార్ తిరుమంజనం, స్వస్తివాచనం, ఋత్విగ్వరణము, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలి

షాబాద్, ఫిబ్రవరి 13: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుదామని బీజేపీ మండల అధ్యక్షుడు లంబాడి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో ప్రజలకు క్యారీ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో కొండ సాధన, కొండ అనురాధ, శ్రీధర్‌రెడ్డి, రాము, మహేందర్, మహేశ్, కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నవీన్, విష్ణు తదితరులున్నారు.

బాలుడి అదృశ్యం

వికాస్ (ఫైల్)

కొత్తూరు, ఫిబ్రవరి 13: ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బావర్చి హోటల్ వద్ద ఆదివారం జరిగింది. కొత్తూరు ఎస్ఐ జి శ్రీనివాసులు వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం మదనపల్లికి చెందిన వానరాసి మనీల ఈ నెల 11 ఆదివారం భిక్షాటన నిమిత్తం కొత్తూరు వికాస్ (11), కూతురు అక్షయ (8) తీసుకొని కొత్తూరు బావర్చి హోటల్ వద్దకు వచ్చింది. అనారోగ్య కారణంగా నేషనల్ హైవే 44 పక్కన ఉన్న వేపచెట్టు వద్ద నిద్రపోయింది. కొంత సమయం తర్వాత లేచి చూడగా వికాస్ కన్పించలేదు. కూతురు అక్షయను అడుగగా తాను కూడా నిద్రపోయానని చెప్పింది. చుట్టు పక్కల వారిని అడిగినా ఫలితం లేదు. వికాస్ ఛామనచాయ రంగు కలిగి ఉన్నాడని , 3 అడుగుల 5 అంగుళాల ఎత్తు ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, నల్లని టీషర్ట్ కలిగి ఉన్నాడని తెలిపారు. తల్లి మనీల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలు తెలిస్తే 9440795743 నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి

- జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 13 : గిరిజన సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. దిల్దార్ ధనరాజు రూపొందించిన 'దొరసాని బంజారా' ఆడియో పోస్టర్‌ను మంగళవా రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూపకర్తతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు శ్రీను, భీమన్‌నాయక్, రాజశేఖర్, పాండు, సూర్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వేడుకలకు ముస్తాబైన ఆలయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 13 : మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో కొలువుదీరిన అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయంలో స్వామివారి విగ్రహాలు, ఆలయానికి రంగులు వేసి పచ్చటి తోరణాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్ శర్మ, మేనేజింగ్ ట్రస్ట్ కోట్ల జగన్‌మోహన్, ఆలయం చైర్మన్ సింగిని శ్రీనివాస్ బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నాంది అంకురార్పణ, ధ్వజారోహణం, రక్షాబంధనం, కలశస్థాపన, ప్రదోశ పూజ తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 5.30 గంటలకు అభిషేకం, అలంకరణ, ప్రాంత:కాల పూజ ,11 గంటలకు వేంకటేశ్వర స్వామి కల్యాణం, మధ్యాహ్నం 1.30 గంటలకు భోజన వితరణ, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి వారి రథోత్సవం, హారతి, రథ సప్తమి, రాత్రి పోతులూ రి వీరబ్రహ్మేంద్రస్వామి త్రిరాత్ర నాటకం, శనివారం ఉదయం ప్రాతః కాల పూజ, చక్రతీర్థం ఆశ్వీరచనం, తీర్థప్రసాద వితరణ ఆదివారం వివిధ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేశారు.

చిన్నారులకు విటమిన్ మందు వేయించాలి

చేవెళ్లటౌన్: చిన్నారులకు విటమిన్ ఏ చుక్కల మందు వేస్తున్న ఆర్డీవో సాయిరాం

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 13: చిన్నపిల్లలకు కంటి చూపు మెరుగు పడేందుకు విటమిన్ ఏ చుక్కల మందును వేయించాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో 9 నెలల నుంచి ఐదేండ్లలోపు చిన్నారులకు విటమిన్ ఏ చుక్కల మందును ఆర్డీవో సాయిరాం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విటమిన్ ఏ అధికంగా ఉన్న ఆహారం తినిపించాలన్నారు. విటమిన్ ఏ లోపం అధికంగా ఉంటే రేటినా, కార్నియా దెబ్బతింటుందన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల కూడా సరిగ్గా ఉండదని సూచించారు. 18వ తేదీ వరకు విటమిన్ ఏ చుక్కల మందు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గోపాల్ రెడ్డి, సంతోశ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : పోచారంలో చిన్నారులకు విటమిన్ ఏ మాత్రలు వేస్తున్న ఎంపీపీ కృపేశ్ తదితరులు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ఇబ్రహీంపట్నంరూరల్ : చిన్నారులు ఆరోగ్యంగా పెరుగటం కోసం వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ కృపేశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోచారం గ్రామంలో చిన్నారులకు విటమిన్ ఏ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. చిన్నారులు ఆరోగ్యంగా, బలంగా ఉండటం కోసం ప్రతి ఒక్క తల్లిదండ్రులు ప్రభుత్వం ఉచితంగా చిన్నారులకు అందజేస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి ఏఈ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

విటమిన్ ఏ మందు పంపిణీ

మంచాల : ఐదు ఏండ్లలోపు బాలబాలికలకు రేచీకటి వంటి వ్యాధులు సోకకుండా ఉండాలంటే విటమిన్ ఏ సిరపులను తాపించాలని ఎంపీటీసీ చీరాల రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన విటమిన్ ఏ సిరపులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల : ఆరుట్ల అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు విటమిన్ ఏ మందు తాపిస్తున్న ఎంపీటీసీ

మైసమ్మ ఆలయంలో చోరీ

కొత్తూరు, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీలోని భవానీ నగర్‌లో గల మందారి మైసమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ ధర్మకర్త మలిపెద్ది విశ్వనాథ్‌గుప్త వివరాల ప్రకారం..40 తులాల వెండి, 20 గ్రాముల బంగారం, హుండీలో రూ. 3 వేల వరకు నగదు ఉందన్నారు. వీటితో పాటు విలువైన రోల్డ్ గోల్డు ఆభరణాలు కూడా కన్పించటంలేదని వివరించారు. ఆరో వార్డు కౌన్సిలర్ వీరమోని హేమా దేవేందర్, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్ ఆలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కొత్తూరు సీఐ నర్సింహారావు ఆలయాన్ని సందర్శించి చోరీ గురించి వాకబు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు. గుడి పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

22 నుంచి వేణుగోపాల స్వామి ఆలయ జాతర

మంచాల, ఫిబ్రవరి 13 : మండలంలోని ఆరుట్ల గ్రామంలో 22 నుంచి 25వ తేదీ వరకు వేణుగోపాలస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీలు చీరాల రమేశ్, కావలి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతర ఏర్పాట్లు గురించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యాదయ్య, జంగయ్య గౌడ్, జనార్దన్‌రెడ్డి, కందాల శ్రీశైలం, సలాం, మాడ్గుల కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, చిందం రఘుపతి, మొర్రి ఐలయ్య, పున్నం రాము, చిందం జంగయ్య, ఖైకని మహేందర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 13 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా జీవిస్తామని ఎంపీపీ కృపేశ్ అన్నారు. మంగళవారం పోచారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఏఈ ఇంద్రసేనారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నార.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్పీటీసీ గోవిందమ్మ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కొమటిరెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మహలింగాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్టేషనరీని అందజేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మొబైల్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాదగిరి, ఉపాధ్యాయులు నరహరి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి వివరాలు అందజేయాలి

షాబాద్, ఫిబ్రవరి 13: గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలు అందజేయాలని విద్యుత్‌శాఖ మండల ఏఈ నరేందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో సిబ్బందితో కలిసి వినియోగదారుల ఇంటింటికీ తిరిగి గృహజ్యోతికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ అందించనున్న 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కోసం వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఆధార్‌కార్డు నంబర్, రేషన్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్ వివరాలు తమ సిబ్బందికి అందజేయాలని వివరించారు. ఈ నెల 15వ తేదీలోగా వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

రాయపోల్‌లో పశువులకు ఉచిత చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 13 : పశువులకు రోగనిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీటీసీలు అచ్చనా శ్రీశైలం, జ్యోతీరెడ్డి అన్నారు. రాయపోల్ గ్రామంలో మంగళవారం సత్యసాయిట్రస్టు ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆవులు, గేదెలు, దూడలకు ఉచితంగా చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మూగజీవాలకు వ్యాధులు సోకితే సొంత వైద్యం చేయకూడదని, పశువైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. శిబిరంలో 42 పశువులకు చుడి పరీక్షలు, 25 పశువులకు గర్భసంబంధ చికిత్సలు, 40 దూడలకు నట్టల మందులు, 35 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వసంతకుమారి, సురేశ్‌బాబు, కవిత, పురుషోత్తం, ప్రవీణ్, గోపాల మిత్రులు జగన్, శివరాజు, సత్యసాయి ట్రస్టు సభ్యులు పున్నయ్య, రామన్న, యాదగిరి పాల్గొన్నారు.

16 మేక పిల్లల్ని చంపిన కుక్కలు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన నల్ల నర్సింహ మేకలను కాస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీప బంధువుల ఇంట్లో విందుకు వెళ్లాడు. గంటలోనే తిరిగిరాగా.. అప్పటికే తాను కాస్తున్న మేక పిల్లలపై పది కుక్కలు దాడి చేసి 16 మేక పిల్లలను చంపేశాయి. కళేబరాలను దూరంగా గుంజుకువెళ్లాయి. స్థానికుల సమాచారంతో పశు వైద్యుడు ఆనంద్‌రెడ్డి అక్కడకు చేరుకుని చనిపోయిన మేక పిల్లలను పరిశీలించారు. బాధితుడిని ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు దేవిడి వేణుగోపాల్‌రెడ్డి అధికారులను కోరారు.